సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ప్రజావాణిలో వివిధ సమస్యలపై 99 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 10 : ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 99 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ధరణికి సంబంధించిన భూసమస్యలు, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్, భూ సర్వే, గ్రామ పంచాయతీ, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు భూ సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఆన్‌లైన్ రికార్డు చెక్ చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులున్నారు.

ప్రజావాణికి హాజరైన ఆయా శాఖల అధికారులు

పీఎం విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 10 : సంప్రదాయ చేతివృత్తులవారు ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో విశ్వకర్మ వృత్తులపై ఆధారపడ్డ కుటుంబాలను ఆదుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి స్వానిధి పథకం అమలు, పురోగతిపై వివిధ శాఖల అధికారులు, పథకం అమలు కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ వృత్తులపై ఆధారపడ్డ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు తోడ్పాటునందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగలి, ఉప్పరి తదితర 18 రకాల చేతివృత్తులవారు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సి.ఎస్.సి కేంద్రాల ద్వారా విశ్వకర్మ చేతి వృత్తుల వారు దరఖాస్తులు చేసుకునేలా, పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వారిలో అవగాహన కల్పించాలని తెలిపారు. రుణాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. చేతి వృత్తులపై ఆధారపడే కుటుంబాలకు వివిధ వృత్తుల్లో శిక్షణ పొందేందుకు ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీటీసీడీవో ఉపేందర్, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, వెంకటయ్య, ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చి తప్పిన రేవంత్

వికారాబాద్, మార్చి 10 : ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేస్తామని నిండు అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు మాటిచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ మండిపడ్డారు. సోమవారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలు తర్వాతే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ఫలితాలు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, ఇతర పరీక్ష ఫలితాలను నిలిపివేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండా ఇతర ఉద్యోగ నియామకాల పరీక్ష ఫలితాలు విడుదల చేస్తూ, మాదిగల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడ్డారు. దీక్షలో ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

నీటి సమస్యపై ఆరా తీస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్ తదితరులు

- పేరుకే మంచినీటి ట్యాంకులు
- ఒక్కటి కూడా సరిగా వినియోగంలోలేని వైనం
- బోర్లు వేయించాలని కరణ్‌కోట గ్రామస్తుల వేడుకోలు

తాండూరు రూరల్, మార్చి 10 : తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామ పంచాయతీలో నీటి కటకట తీవ్రమైంది. జిల్లాలోనే పెద్ద గ్రామపంచాయతీ. అదేస్థాయిలో నీటి సమస్య కూడా ఉన్నది. సమస్యను తీర్చడంలో అధికారులు విఫలమయ్యారని లేబర్ కాలనీ, జయశంకర్ కాలనీ, శిశు మందిర్ స్కూల్, బంగారమ్మ కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడితో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. పంచాయతీ పరిధిలో 5 మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. కానీ ఒక్కటి కూడా సరిగా వినియోగంలో లేదు. కనీసం బోర్లు వేయిస్తే నీటి సమస్య తీరుతుందని కరణ్‌కోట గ్రామస్తులు అధికారులను వేడుకొంటున్నారు.

పాత పైపులైన్‌ను పునరుద్ధరించాలి

పాత పైపులైన్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కర్నాటక సరిహద్దులోని జెట్టూరు వాగులో ఉన్న మోటర్లకు మరమ్మతులు చేసి, పైపుల ద్వారా ట్యాంకుల్లోకి నీటిని ఎక్కిస్తే నీటి సమస్య తీరే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో ఈ నీరే గ్రామానికి సరిపోయేదని తెలిపారు. మిషన్ భగీరథ పైపుల ద్వారా నీటిని ట్యాంకుల్లోకి ఎక్కించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక, దాహం తీరక కరణ్‌కోట ప్రజలు నీటి కోసం పాట్లుపడుతున్నారు.

గ్రామ సందర్శన

నీటి సమస్య తీర్చాలంటూ మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ తోపాటు పలువురు గ్రామస్తులు ఎంపీడీవోకు విన్నవించారు. ఈ మేరకు ఎంపీఈవో విశ్వప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్‌తో కలిసి కాలనీలను పరిశీలించారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. బోరు లేదా పాత పైపులైన్ పునరుద్ధరణ పనులు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జెట్టూరు వాగు వద్ద ఉన్న నీటి బావిని పరిశీలిస్తున్న అధికారులు

చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 8 : చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి, అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటలకు సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతున్నదని, ఎగువ భాగాన రైతులు ఎక్కువగా మోటర్లు పెడుతున్నారన్నారు. చివరి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ఎక్కడా పంటలు ఎండిపోకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.


సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫోరం ప్రతినిధులు

దేశంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను నెలకొల్పిన ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్, మార్చి 10 : విద్యకు నోచుకోక వివక్షకు గురవుతున్న సమాజంలో దేశంలోనే మొట్టమొదటి మహిళా పాఠశాలను నెలకొల్పి మహిళలకు విద్యను అందజేసిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు స్వర్గీయ సావిత్రీబాయిపూలే అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (వీడీడీఎఫ్) ఆధ్వర్యంలో వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే దంపతులు సమాజంలో అంటరానితనం, అస్పృశ్యత, సతీసహగమనం లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషిచేశారన్నారు.

వీడీడీఎఫ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేడు మహిళలకు ఆకాశంలో సగం, అవకాశాలలో సగం అని అడిగే చైతన్యం వచ్చిందంటే ఆనాడు సావిత్రీబాయి పూలే చేసిన వీరోచిత పోరాటం, కృషి ఫలితమే అని కొనియాడారు. పూలే దంపతులు బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరవ లేనివని తెలిపారు. వారిని సమాజం మొత్తం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. వికారాబాద్‌లో పూలే దంపతుల విగ్రహాలను పెట్టాలని, వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులున్నారు.

ప్రజావాణికి 62 ఫిర్యాదులు

వినతులు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

ఆదిబట్ల, మార్చి 10 : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఇతర శాఖలు-33 మొత్తం 62 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజావాణిలో అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరింటెండెట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ ఎన్ ఆన్‌లైన్ శాంపిల్ సర్వే

విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

బొంరాస్‌పేట్, మార్చి 10 : వికారాబాద్ జిల్లా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ప్రాథమిక పాఠశాల టేకులగడ్డతండా పాఠశాలను జిల్లా డైట్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ మహేందర్, పర్యవేక్షకురాలు ఆయుషి సోమవారం పరిశీలించారు. ఎస్సీఆర్టీ నిబంధనల మేరకు ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన మూల్యాంకనం నిర్వహించడం జరుగుతుందన్నారు. 2వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ద్వారా బేసిక్ అంశాలపై ఆప్ ద్వారా ఈ నెల 10, 11, 12 తేదీల్లో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై అవగాహన ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్సీఈఆర్టీకి తెలియజేస్తామన్నారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ వాలీబాల్ జట్టుకు వేణు ఎంపిక

కులకచర్ల, మార్చి 10 : మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు తెలంగాణ రాష్ట్ర పోలీస్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. వేణు సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ ఆఫీసులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10 నుంచి 11 వరకు హర్యానాలో మధుబన్ పోలీస్ అకాడమీలో జరుగుతున్న ఆల్ ఇండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్‌లో పాల్గొంటున్న తెలంగాణ పోలీస్ వాలీబాల్ టీమ్‌లో వేణు ఆడనున్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్, మార్చి 10 : నేడు చేవెళ్లలో నిర్వహించే మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రముఖ(ఎంఎన్‌సీ)ఎలక్ట్రానిక్ కంపెనీ కొంగరకలాన్, తుక్కుగూడ, ఇండస్ట్రియల్ పార్క్ రంగారెడ్డిజిల్లా, హైదరాబాద్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాలు పైబడిన మహిళలు, పదవ తరగతి పాసై ఉండాలని, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ ఉన్నవారు అర్హులని చెప్పారు. నెలకు రూ.15వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. పదవ తరగతి మార్క్ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు-2 తీసుకుని సకాలంలో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9390907201ను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, మార్చి 10 : ఇంటర్ రెండో సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జనరల్ విద్యార్థులు 5738 మందికి 5669., ఒకేషనల్ విద్యార్థులు 1230 మందికి 1183 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు.

కంటోన్మెంట్ బోర్డు విలీన ప్రక్రియ షురూ

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియలో ఎట్టకేలకు చర్యలు మొదలయ్యాయి. ఈ మేరకు పలువురు కంటోన్మెంట్ అధికారులు సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా భూ సేకరణపై చర్చించినట్లు సమాచారం. కాగా కంటోన్మెంట్ బోర్డు పరిధి మొత్తాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రధానాంశాలపై అధ్యయనం చేసేందుకు కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీలోని ఉభయ శాఖల అధికారులు కంటోన్మెంట్ బోర్డు విలీనంలో భాగంగా జీహెచ్ఎంసీ అప్పగించనున్న రోడ్లు, ఇతర పౌర సేవల నిర్వహణ అంశాలతోపాటు ఇతర అంశాలను అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.

కరెంట్ పోయింది!

వెల్లువెత్తుతున్న నెటిజన్ల ఫిర్యాదులు
గంటల తరబడి పోతుందంటూ ఆగ్రహం
విద్యుత్ సిబ్బంది స్పందించడం లేదంటూ పోస్టులు

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): 24 గంటల విద్యుత్ సరఫరా.. కరెంట్ కోతలకు ఆస్కారమే లేదు.. ఇది రేవంత్ సర్కార్ వేదికలపై కొడ్తున్న కోతలమూట.. కోతలే లేవు.. ఎంత డిమాండ్ వచ్చినా సప్లైలో అంతరాయముండదు.. ఇది దక్షిణ డిస్కం ఉన్నతాధికారుల నమ్మకమైన మాట.. కానీ క్షేత్రస్థాయిలో ఇవన్నీ అబద్ధాలని తేలింది. సోషల్ మీడియా వేదికగా కరెంట్ కోతలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కరోజులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సిబ్బంది సతమతమవుతున్నారు. లోడ్ పెరిగితే సప్లైలో కొంత సమస్యలుంటాయని విద్యుత్ రంగ నిపుణులు మొదటి నుంచి హెచ్చరిస్తున్నా.. సర్కార్ మాత్రం వారి మాటలను పెడచెవిన పెట్టి అత్యుత్సాహంతో, అధికార దర్పంతో తమదైన ధోరణిలో ప్రజలను తమ 24 గంటల మాటలతో మభ్యపెట్టి మాయచేయాలని చూసింది. కానీ ఆ మాయలు పటాపంచలయ్యాయి. ఒక్కరోజులో కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక జనం ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఈ కరెంట్ కోతలేంటంటూ మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో లేని పవర్‌కట్స్ ఇప్పుడు ఎలా వస్తున్నాయంటూ విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. దీంతో కరెంట్ కోతలే లేవని చెప్పిన సర్కార్ కోతల మాటలను ఇప్పుడు నమ్మే పరిస్థితి పోయింది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి, అర్ధరాత్రి.. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ కరెంట్ తీసేస్తున్నారు. దీనిపై ఒక్క సోమవారమే ఎక్స్ వేదికగా నెటిజన్ల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మూడురోజులుగా ఈ కోతలపై నెటిజన్లు స్పందిస్తూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నప్పటికీ సోమవారం ఈ తీవ్రత మరింత పెరిగింది.

ఒక్కరోజులో వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు..!

ఎక్స్ వేదికగా పలువురు నెటిజన్లు వివిధ ప్రాంతాల్లో కరెంట్ పోయిందంటూ అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు చేశారు. టోలీచౌకిలో పోడియం మాల్ బ్యాక్ సైడ్ ప్రతిరోజూ ఉదయం కరెంట్ పోతున్నదని ముబషీర్‌అలీ, షేక్‌పేట్ ఏరియాలోని హమ్రా కాలనీలో ఉదయం నుంచి కరెంట్ లేదంటూ మహీంద్ర ఫిర్యాదు చేశారు. మీరాలం ప్రాంతంలో రెండుగంటలుగా కరెంట్ లేదని, తాను ఫిర్యాదు చేద్దామని ప్రయత్నిస్తే ఎవరూ అందుబాటులో లేరంటూ ఫిర్యాదు చేశారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో కరెంట్ పోవడం ఒక ఎత్తు అయితే.. తెల్లవారుఝామున, అర్ధరాత్రి సమయాల్లో కరెంట్ పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఈ పోస్టుల ద్వారా తెలుస్తున్నది. అయితే ఎక్కడా కరెంట్ కోతలు లేవని, ఎక్కడైనా కోతలు ఉంటే వెంటనే తమ నోటీసుకు వస్తాయంటూ ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నా.. ఆ పరిస్థితి మాత్రం క్షేత్రస్థాయిలో లేదని ఈ పోస్టుల ద్వారా అర్థమవుతున్నది. మరోవైపు కొందరు వినియోగదారులు తాము ఫిర్యాదు చేయగానే వ్యక్తిగత సమాచారం అడగడంతో విద్యుత్ అంతరాయం ఉన్న ప్రాంతం చెప్పినా తమను వ్యక్తిగత సమాచారం ఎందుకు అడుగుతున్నారంటూ మండిపడ్డారు. ఇంకా వేసవి కాలం మొదలే కాలేదు.. ఇప్పుడు ఇంత ఇబ్బంది ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితేంటంటూ సీఎంకు, టీజీఎస్‌పీడీసీఎల్‌కు ట్యాగ్ చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారు.

సాంకేతికతతో లోపాలు గుర్తించి.. పరిష్కారం

-టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

విద్యుత్ సరఫరాలో లోపాలను త్వరగా గుర్తించి సకాలంలో పరిష్కరించే ఉద్దేశంతో టీజీఎస్‌పీడీసీఎల్ తన పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాంకేతికతను అమలు చేస్తున్నామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా ఫీడర్‌లో దెబ్బతిన్న ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించవచ్చని, లోపం ఎక్కుడుందో సులభంగా గుర్తించడానికి వీలుగా జీఐఎస్ డేటాను సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కు సాసా యాప్‌కు బజర్ సౌండ్ ద్వారా అప్రమత్తం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని 11 కేవీ ఫీడర్లు 8621లలో ఈ సాంకేతికతను పొందుపరుస్తున్నామని, ప్రస్తుతానికి 4433 ఫీడర్ల పరిధిలో పొందుపరిచినట్లు తెలిపారు. మిగిలిన ఫీడర్లకు గాను మార్చి నెలాఖరునాటికి ఈ సాంకేతికతను పొందుపరుస్తామని ఫరూఖీ తెలిపారు. అన్ని సర్కిళ్ల, జోన్ల ఎస్ఈలు, సీఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి సీజన్ పీక్ స్టేజ్‌లో ఉన్నదని, డిమాండ్ 17 వేల మెగావాట్లకు చేరువలో ఉన్నదన్నారు. ఈ సీజన్‌లో 10 వేల మెగావాట్లకు మించి గరిష్ఠ డిమాండ్ రికార్డ్ అవుతున్నది. ఈ నెల 4న 10533 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్, 5న 215.52 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్‌పీడీసీఎల్ పేర్కొంది.